సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 19 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.26,350

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీ గరిష్టంగా రూ.26,350, కనిష్టంగా రూ.8,500, సరాసరిన రూ.18,190 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.9 ప్రకారం ధర పలికింది.



జిల్లాలో శనివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'నవోదయ' పరీక్షకు 5,492 మంది హాజరు



ధర్మవరంలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ కృష్ణప్ప

లేపాక్షి: నవోదయ విద్యాలయలో 6వ తరగతి ప్రవేశాలకు శనివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 7,987 మంది దరఖాస్తు చేసుకోగా అధికారులు 34 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో 5,492 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మరో 2,495 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని 19 పరీక్ష కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు.

21న జిల్లాకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు

ప్రశాంతి నిలయం: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతు హుస్సేన్ ఈనెల 21న పుట్టపర్తికి రానున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న బెంగళూరులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న జాతు హుస్సేన్, 21వ తేదీ అక్కడి నుంచి రోడ్డు మార్గాన కదిరి చేరుకుని ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుంటారని వెల్లడించారు. అనంతరం కదిరి రూరల్ పరిధిలోని రామ్‌దాస్ తండా, బోడి నాయక్ తండా, నాయక్ తండాలను సందర్శిస్తారన్నారు. అదే రోజు ఉదయం 11 గంటలకు ముదిగుబ్బ మండలంలోని జొన్నల కొత్తపల్లిలో పర్యటిస్తారన్నారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5 గంటల వరకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్, ఆర్డీఓలు, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారులు, డీఎస్పీలతో సమావేశమై సమీక్షిస్తారని తెలిపారు.

సత్య శ్రీనివాసం.. ఆధ్యాత్మిక వైభవం



సాయి శ్రీనివాసం నృత్యరూపకంలోని ఘట్టం

ప్రశాంతినిలయం: తిరుమలలో వెలసిన శ్రీనివాసుడి ప్రతి రూపమే సత్యసాయి అన్న సందేశాన్నిస్తూ భక్తులు ప్రదర్శించిన సంగీత నృత్య రూపకం పరవశింపజేసింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన తిరుపతి సత్యసాయి భక్తులు శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత 'సత్య శ్రీనివాసం' పేరుతో సంగీత నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. అవతారమూర్తులు శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, వెంకటేశ్వరుడి లీలా వైభవాన్ని వివరిస్తూ కలియుగంలో అవతరించిన దైవస్వరూపుడు సత్యసాయి అన్న సందేశాన్నిచ్చారు. వెంకటేశ్వర స్వామి లీలా వైభవాన్ని, సత్యసాయి లీలను కొనియాడుతూ చక్కటి ఘట్టాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అంతకుముందు ఉదయం సత్యసాయిని కీర్తిస్తూ వారు నిర్వహించిన సంగీత కచేరీ అలరించింది. అనంతరం వారు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.


కుష్టు వ్యాధిని నయం చేయొచ్చు



కుష్టు వ్యాధి నిర్మూలనపై ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజ్ బేగం

పుట్టపర్తి అర్బన్: కుష్టును ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ఆరు మాసాల్లోనే వ్యాధిని నయం చేయొచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం తెలిపారు. శనివారం పుట్టపర్తి పీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఎనుములపల్లి నుంచి గణేష్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను నివృత్తి చేసి, వ్యాధి సోకిన వారిని గుర్తించి తగిన చికిత్స అందించాలన్నారు. జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ తిప్పయ్య మాట్లాడుతూ మనిషిలో దాగి ఉన్న వ్యాధి లక్షణాలను గుర్తించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. జనవరి 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేయనున్నారన్నారు. సంక్షేమ హాస్టళ్లలో ఉన్న విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేయించాలని ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత పేర్కొన్నారు.

కూడు...గూడు..మనిషి కనీస అవసరాలు. ఏ ప్రభుత్వాలైనా వీటిపైనే దృష్టి సారిస్తాయి. కానీ రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి సర్కార్ నిరుపేదలకు మేలు చేయాల్సింది పోయి.. అన్యాయం చేసేందుకు సిద్ధమైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్థలాలు పొంది ఇళ్లు నిర్మించుకోలేని వారి పట్టాలు రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. వాటిని తిరిగి తమ అనుచరులకు కట్టబెట్టేందుకు సిద్ధమైంది. దీంతో జిల్లాలోని వేలాది మందికి సొంతిళ్లు కలగానే మిగిలిపోనుంది.



జగనన్న లేఅవుట్లలో పట్టాల రద్దుకు కుట్ర

పేదల గూడు.. కూటమి కీడు!

- రెండు రోజుల కిందట కేబినెట్‌లో నిర్ణయం
- ఇంటి పట్టాలు కోల్పోనున్న వేలాది మంది నిరుపేదలు
- వాటిని తమ మద్దతుదారులకు ఇచ్చేందుకు స్కెచ్
- నిరుపేదల సొంతింటి కలను భగ్నం చేస్తున్న ప్రభుత్వ పెద్దలు



కొత్తచెరువు సమీపంలోని జగనన్న లేఅవుట్‌లో ఖాళీగా ఉన్న స్థలాలు

పుట్టపర్తి: ఏడు నెలల పాలనలో అన్ని వర్గాలనూ ఏడిపించిన కూటమి సర్కార్... తాజాగా నిరుపేదలకు నిలువనీడ లేకుండా చేసేందుకు సిద్ధమైంది. నిరుపేదల ఇళ్ల నిర్మాణాలకు ఇచ్చే ఆర్థిక సాయాన్ని పెంచామంటూ ఓ వైపు ప్రచారం చేస్తూ... మరో వైపు ఇప్పటికే స్థలాలు పొంది ఆర్థిక ఇబ్బందులతో ఇల్లు నిర్మించుకోలేని వారి పట్టాలు రద్దు చేసేందుకు సిద్ధమైంది. ఈ మేరకు రెండు రోజుల క్రితం జరిగిన కేబినెట్‌లో నిర్ణయం కూడా తీసుకుంది. పేదల గూడుపై కూటమి నేతలు చేస్తున్న కుట్రపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

7 వేలకుపైగా పట్టాల రద్దు!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ నిరుపేదల సంక్షేమానికి కృషి చేశారు. ముఖ్యంగా ఇళ్లులేని నిరుపేదలకు కుల, మత, రాజకీయాలకు అతీతంగా పట్టాలిచ్చి ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సాయం చేశారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో 298 జగనన్న లేఅవుట్లలో 30,985 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. ఇవికాకుండా సొంత స్థలం ఉన్న వారికీ మరో 28,918 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 20 వేల మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నారు. మిగిలిన వారి ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. జగనన్న లేఅవుట్లలో స్థలాలు పొంది నేటికీ ఇంటి నిర్మాణం ప్రారంభించని వారు జిల్లాలో 7,199 మంది ఉన్నారు. కూటమి ప్రభుత్వం తాజా నిర్ణయంతో వీరి పట్టాలన్నీ రద్దు కానున్నాయి.

అనుచరులకు కట్టబెట్టేందుకే

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలిచ్చారు. ప్రస్తుత కూటమి సర్కార్ మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలోనే కేవలం కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు మేలు చేసేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం జగన్ సర్కార్ పేదలకు ఇచ్చిన పట్టాలను రద్దు చేసి...వాటిని మళ్లీ తమ అనుచరులు, కార్యకర్తలకు ఇచ్చేందుకు సిద్ధమైంది.

అభివృద్ధి చేసిన లేఅవుట్లపై కన్ను

గత జగన్ ప్రభుత్వం జిల్లాలో జగనన్న లేఅవుట్లలో పేదలకు పట్టాలిచ్చి పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. రోడ్లు, విద్యుత్ లైన్‌లు, నీటి సౌకర్యం లాంటి పనులు పూర్తి చేసింది. ఇలా అభివృద్ధి చేసిన లే అవుట్లలో స్థలాల విలువ అమాంతంగా పెరిగింది. ప్రస్తుతం రూ.లక్షల్లో పలుకుతున్న ఆ స్థలాలను తమవారికి కట్టబెట్టేందుకు కూటమి నేతలు ప్లాన్ చేశారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించలేదన్న సాకుతో పట్టాలన్నీ రద్దు చేసేందుకు ప్రభుత్వం ద్వారా ఆదేశాలు ఇప్పిస్తున్నారు.

కొత్తవారికే పెంచిన సాయం!

గత ప్రభుత్వ హయాంలో ఇంటి నిర్మాణం ప్రారంభించిన చాలా మంది ఆర్థిక ఇబ్బందులతో నిర్మాణాలు పూర్తి చేసుకోలేక పోయారు. జిల్లాలో 40 వేల మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. కాగా కూటమి ప్రభుత్వం ఇంటి నిర్మాణాలకు చేసే ఆర్థిక సాయాన్ని రూ.4 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటన చేసింది. దీంతో ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్న వారంతా తమకూ సాయం అందుతుందని, ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని హాయిగా ఉండవచ్చని ఆనంద పడ్డారు. కానీ కూటమి ప్రభుత్వ పెద్దలు ఇందులో పెద్ద మెలిక పెట్టారు. ఇక నుంచి మంజూరు చేసే ఇంటి నిర్మాణాలకే పెంచిన మొత్తం వర్తిస్తుందని తేల్చి చెప్పారు. ఇళ్లు నిర్మించుకోలేని వారి పట్టాలు రద్దు చేసేందుకు సిద్ధమైన కూటమి ప్రభుత్వం ఆ నిర్ణయం ఉపసంహరించుకుని, పెంచిన ఆర్థిక సాయం వర్తింపజేస్తే నిరుపేదలంతా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందని, అలాకాకుండా కేవలం తమ వారికి మేలు జరిగేలా కూటమి ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమని నిరుపేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రద్దు నిర్ణయం దుర్మార్గం



నాకు గత ప్రభుత్వంలో పుట్టపర్తి సమీపంలోని బ్రాహ్మణపల్లి దగ్గర స్థలం ఇచ్చి ఇల్లు కూడా మంజూరు చేశారు. అయితే ఆర్థిక పరిస్థితులు బాగోలేక ఇంటి నిర్మాణం ప్రారంభించలేకపోయాను. నాలాంటి వారు చాలా మందే ఉన్నారు. మా అందరికీ మరింత చేయూతనందించి ఇంటి నిర్మాణానికి సహకరించాలి. అది చేయకుండా పట్టాలు రద్దు చేస్తామనే నిర్ణయం దుర్మార్గం.
– లక్ష్మీదేవి బాయి, పుట్టపర్తి

ఆర్థికసాయం చేస్తే ఇల్లు కట్టుకుంటా



గత ప్రభుత్వం జగనన్న లే అవుట్‌లో ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కూడా మంజూరు చేసింది. అయితే డబ్బు సమస్యతో ఇంటి నిర్మాణం చేపట్టలేక పోయా. ఇప్పుడేమో కూటమి ప్రభుత్వం ఇల్లు నిర్మించుకోలేనివారి పట్టాలు రద్దు చేస్తామని చెబుతోంది. ఇది అన్యాయం. కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు రూ.4 లక్షలు ఇస్తామని చెబుతోంది. మాలాంటి వారికి ఆ మొత్తం ఇస్తే వెంటనే ఇంటి నిర్మాణాలు ప్రారంభించుకుంటాం.
– నాగమ్మ బాయి, ప్రశాంతి గ్రామం, పుట్టపర్తి

గత ప్రభుత్వంలో జిల్లాలోని నియోజకవర్గాల వారీగా మంజూరైన ఇళ్ల వివరాలు..

నియోజకవర్గం	మంజూరైన ఇళ్లు	పూర్తయిన ఇళ్లు	ప్రారంభం కానివి
ధర్మవరం	16,172	4,096	2,183
హిందూపురం	11,408	2,667	628
కదిరి	4,783	1,346	676
మడకశిర	1,073	483	243
పెనుకొండ	6,650	3,216	154
పుట్టపర్తి	18,810	5,148	2,731
రాప్తాడు	7,497	2,535	584

సమష్టి కృషితోనే స్వచ్ఛత సాధ్యం



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ చేతన్

- 'స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్'లో కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: యంత్రాంగం, ప్రజల సహకారంతో స్వచ్ఛతవైపు అడుగులు వేస్తున్నామని, త్వరలోనే శ్రీసత్యసాయిని స్వచ్ఛ జిల్లాకు చిరునామాగా మారుస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. ఈ క్రమంలోనే ప్రతి నెలా మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్'ను జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. శనివారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలో నిర్వహించిన 'స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్'లో డీపీఓ సమంత, మండల స్పెషలాఫీసర్ శుభదాస్, డ్వామా పీడీ విజయ్‌ప్రసాద్ తదితరులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, 'స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా తొలుత ప్రభుత్వ కార్యాలయాలు, నివాసిత ప్రాంతాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, బస్టాండులు, రైల్వే స్టేషన్లు, వీధులు తదితర ప్రదేశాల్లో పరిశుభ్రతా చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛ పరిసరాలను అందించే లక్ష్యంతో అధికారులు, ప్రజలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఒక్కో నెల ఒక్కో థీంతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 'స్వచ్ఛ' కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ప్రజలతో కలిసి స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించిన కలెక్టర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలోని వీధులు, మురుగు కాలువలు, పైప్‌లైన్లను నిశితంగా పరిశీలించారు. గ్రామంలో ఆలయం వద్ద మానవహారం ఏర్పాటు చేసి 'స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్'పై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామానికి చెందిన రైతు నరసింహమూర్తి నిర్మించిన గోకులాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కప్పలబండ, వెంకటగారిపల్లి సర్పంచ్‌లు చిన్న పెద్దన్న, లక్ష్మీనరసమ్మ, జగరాజుపల్లి వైస్ సర్పంచ్ జనార్దన్, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, నాయకులు మల్లిరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... శ్రీనివాసుడి కల్యాణం



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు



కల్యాణ వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు

ప్రశాంతి నిలయం: టీటీడీకి చెందిన వేద పండితుల వేదమంత్రోచ్ఛారణలు...భక్తుల జయజయ ధ్వానాల నడుమ వేంకటేశ్వరుడి కల్యాణం కమనీయంగా సాగింది. తిరుమల తిరుపతి దేవస్థానాలు, తిరుపతి జిల్లా సత్యసాయి సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రశాంతి నిలయంలోని పూర్ణ చంద్ర ఆడిటోరియంలో శ్రీనివాస కల్యాణోత్సవ వేడుకలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడిని కనులారా దర్శించుకుని తరించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వేంకటేశ్వరుడి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని పూర్ణచంద్ర ఆడిటోరియంలోని వేదికను ప్రత్యేక ఫల, పుష్ప, దళాలతో అలంకరించారు. కల్యాణోత్స వేడుకలతో ప్రశాంతి నిలయంలో పండుగ వాతారణం నెలకొంది. వేడుకల్లో సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు భారీగా పాల్గొన్నారు.

- అనంతపురంలో ఆదివారం 10కె రన్, 5కే వాక్ నిర్వహిస్తున్నారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి అనంతపురం కలెక్టర్ వి.వినోద్ కుమార్, ఎస్పీ పి. జగదీష్, అల్ట్రా రన్నర్ జియస్ మానుయల్ వైరా ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఉదయం 6 గంటలకు కలెక్టరేట్ వద్ద కార్యక్రమం ప్రారంభమై, ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్ వద్ద ముగియనుంది.

విశాఖ ఉక్కును 'సెయిల్'లో విలీనం చేయాలి

- ప్యాకేజీతో విశాఖ ఉక్కు కర్మాగారం గట్టెక్కదు
- ప్రైవేటీకరణను వ్యతిరేకించిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి



ఆనందరంగారెడ్డి

మడకశిర: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేసే చర్యలను వెంటనే నిలిపివేసి స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో విలీనం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కె.ఆనందరంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమకు ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఏమాత్రం సరిపోదన్నారు. ప్యాకేజీతో కేంద్రం పరిశ్రమను ప్రైవేటు పరం చేసేందుకు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. కర్ణాటకలోని భద్రావతిలో ఉన్న విశ్వేశ్వరయ్య ఉక్కు కర్మాగారం సామర్థ్యం కేవలం 0.7 మిలియన్ మెట్రిక్ టన్నులు కాగా, నెల రోజుల క్రితం కేంద్ర మంత్రి కుమారస్వామి రూ.15 వేల కోట్ల ప్యాకేజీని ప్రకటించారని, మరి 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న విశాఖ ఉక్కుకు ఎంత ఇవ్వాలో ప్రభుత్వ పెద్దలే ఆలోచించాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడపాలని ఉద్యమ కారులంతా డిమాండ్ చేస్తున్నారని, దాన్ని పక్కన పెట్టి కేంద్రం ప్యాకేజీ ప్రకటించడం... దాన్ని కూటమి నాయకులు ఆహ్వానించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు.

జగన్ హయాంలోనే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానం

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్ మాత్రమేనని ఆనందరంగారెడ్డి గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో విశాఖ ఉక్కును ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేశారన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వైఎస్ జగన్ అడ్డుకున్నారని స్వయానా కేంద్ర మంత్రి కుమారస్వామే చెప్పారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే చర్యలు నిలిపివేయాలని, ఉద్యమకారులు, కార్మికుల న్యాయమైన డిమాండ్లకు అనుగుణంగా విశాఖ ఉక్కును ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడపడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

మద్య నిషేధం దిశగా మరో గ్రామం



మద్య రహిత గ్రామం బోర్డు వద్ద నినదిస్తున్న గ్రామస్తులు

పావగడ: తాలూకాలో అక్రమ మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో మందు బాబుల బెడద తట్టుకోలేక కొన్ని గ్రామాలు మద్య నిషేధిత, మద్య రహిత గ్రామాలుగా ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే వదనకల్‌ను మద్య నిషేధిత గ్రామంగా పేర్కొంటూ గ్రామ నడి బొడ్డున బోర్డు పెట్టిన సంగతి విదితమే. అదే తరహాలో తాలూకా లోని గోవర్ధనగిరి గ్రామస్తులు సైతం తమ గ్రామాన్ని 'మద్య పాన రహిత గ్రామం'గా పేర్కొంటూ శనివారం బోర్డు ఏర్పాటు చేశారు. మహిళలు మాట్లాడుతూ మద్యం విరివిగా అందుబాటులోకి తేవడంతో యువకులు, పెద్దలు మద్యానికి బానిసై డబ్బంతా ఖర్చు చేస్తూ కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నుంచి తమ గ్రామంలో మద్యం అమ్మడానికి వీలులేదని, ఒక వేళ అమ్మితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

మద్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు

పుట్టపర్తి టౌన్: మద్యం అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా, మద్యం కల్తీ చేసినా చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారి గోవిందనాయక్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 87 లైసెన్స్ మద్యం షాపులు ఉన్నాయని తెలిపారు. గడిచిన మూడు నెలల్లో సరిహద్దు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, 306 కేసులు నమోదు చేసి, 310 మంది నిందితులను అరెస్ట్ చేసి, 1,740 లీటర్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారాపై 54 కేసులు నమోదు చేసి 95 లీటర్ల నాటుసారా, 10,670 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. 142 బెల్టు షాపులపై దాడులు నిర్వహించి, 146 మందిని అరెస్ట్ చేసి, 378 లీటర్ల మద్యాన్ని, 18 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

డిప్లొమాతో ఉజ్వల భవిత

పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు శిక్షణ ఒక్క డిప్లొమా కోర్సులోనే సాధ్యమవుతుంది. పూర్తిగా ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో కోర్సు రూపకల్పన చేయడమే ఇందుకు కారణం. ఈ కోర్సు రెండు, మూడేళ్లలో పూర్తవుతుంది. కోర్సు పూర్తయ్యేలోపే ఉద్యోగావకాశం లభిస్తుంది. కళాశాల నుంచి నేరుగా కంపెనీకి వెళ్లేలా కోర్సులను తీర్చిదిద్దారు.

- కోర్సు పూర్తయ్యేలోపు కొలువు
- కలిసి వస్తున్న క్యాంపస్ సెలక్షన్లు
- ఆసక్తి చూపుతున్న గ్రామీణ విద్యార్థులు



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురం

అనంతపురం: డిప్లొమాతో తక్షణ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతున్నాయి. 18 సంవత్సరాలకే ఐదంకెల వేతనంతో సంపాదన మొదలు పెట్టవచ్చు. కియా లాంటి అంతర్జాతీయ పరిశ్రమలకు సంబంధించిన ప్రత్యేక నైపుణ్య కేంద్రాలను అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం చొరవ కారణంగా ఈ నైపుణ్య కేంద్రం ఏర్పాటైంది. గత ప్రభుత్వం ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేయడంతోనే అవకాశాలు ముంగిట్లో ఉంటున్నాయి. ఇందుకు అనుగుణంగా శిక్షణ ఇస్తుండడంతో సులువుగా అవకాశాలు అందిపుచ్చుకోవడానికి ఆస్కారం ఏర్పడుతోంది. మరో వైపు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సులకు అధిక డిమాండ్ ఏర్పడడానికి క్యాంపస్ కొలువుల్లో గణనీయంగా ఎంపిక కావడమే. ఎన్‌బీఏ (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు గతేడాది వచ్చింది. ఎలక్ట్రికల్, ఈసీఈ, ఆటోమొబైల్స్, సివిల్, మెకానికల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులు డిప్లొమా కోర్సుల పట్ల ఆసక్తి చూపుతున్నారు. ప్రతి ఏటా కోర్సులో చేరేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారు.

ప్రత్యేక శిక్షణతో సత్ఫలితాలు

డిప్లొమా చదివే ప్రతి విద్యార్థికీ ఉజ్వల భవిష్యత్తు దక్కేలా చర్యలు తీసుకున్నారు. నిపుణుల సహకారంతో పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా కోర్సును రూపొందించారు. విద్యా సంవత్సరం పూర్తికాగానే ఉద్యోగాలకు ఎంపికయ్యేలా నైపుణ్యాల పెంపుదలకు బాటలు వేశారు. అందులో భాగంగానే అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కియా శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పారు. తద్వారా కోర్సు పూర్తికాగానే విద్యార్థులు సులువుగా కొలువులు సంపాదిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో కోర్సు పూర్తి చేసిన 228 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయి. మొత్తం 250 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 228 మంది రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీకి ఎంపికయ్యారు. మెకానికల్ ఇంజినీరింగ్‌లో 75, ఆటోమొబైల్ 11, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ 75, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్‌లో 67 మందికి ఉద్యోగాలు వరించాయి. నెలకు రూ.18,500 జీతం, హాజరు బోనస్ రూ.1500, వార్షిక బోనస్ రూ.12 వేలు, ఉచిత రవాణా, ఆహారం అందిస్తారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలపై ప్రత్యేక దృష్టి



కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. డిప్లొమా మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులకు ఇండస్ట్రియల్ ఓరియంటెడ్ శిక్షణ ఇస్తున్నాం. భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందిస్తున్నాం. ఇప్పటికే 228 మందికి కొలువులు దక్కాయి. మరికొన్ని ఫలితాలు రావాల్సి ఉంది.

– డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఈఈఈ విభాగాధిపతి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురం

కలలో కూడా ఊహించలేదు



మాది తాడిపత్రి. నాన్న ఎం.శంకర్, అమ్మ ఎం.రమ. నాన్న సెలూన్ షాపు నిర్వహిస్తున్నాడు. డిప్లొమాలో కోర్ సబ్జెక్టుపై పట్టు సాధించాలి. నైపుణ్యాలు పెంపొందించుకునేలా శిక్షణ ఇచ్చారు. అధ్యాపకులు మాపై ప్రత్యేక శ్రద్ధ వహించి శిక్షణ ఇవ్వడంతో నాకు రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. చెన్నైలో పని చేయాల్సి ఉంది. ఇంత త్వరగా ఉద్యోగం వస్తుందని కలలో కూడా ఊహించలేదు. సంతోషంగా ఉంది.

– ఎం.రాజేష్, తాడిపత్రి

ఆనందంగా ఉంది



నాది ధర్మవరం. నాన్న పి.రామ్మోహన్ ఆర్టీసీ కండక్టర్. అమ్మ పి.లీలావతి. నేను డిప్లొమా కోర్సు చేశా. ఇంటర్వ్యూలో కారుపైన స్క్రాచ్‌లు వస్తే కస్టమర్‌ను ఎలా కన్విన్స్ చేస్తారనే అంశంపై ప్రశ్నలు అడిగారు. కస్టమర్లతో ఎలా మాట్లాడాలి. నూతన కారును ఎలా డిజైన్ చేయాలనే అంశాల గురించి అడిగారు. బేసిక్స్ అంశాలపై పట్టు సాధించడం వల్ల రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఆనందంగా ఉంది. మరో మూడు కంపెనీలకు కూడా ఇంటర్వ్యూలకు హాజరయ్యాను.

– పి. హరిణి, ధర్మవరం

మాటల్లో చెప్పలేని సంతోషం



మాది అనంతపురం. నాన్న వి.ఆదినారాయణ పెయింటింగ్ కాంట్రాక్టర్, అమ్మ వి.అంజనమ్మ. డిప్లొమా కోర్సు చేసిన నేను బెంగళూరులోని ముసాచి అనే కంపెనీలో ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేశాను. ఆ అనుభవం కలిసొచ్చింది. ఇంటర్వ్యూలో ఏ రకంగా ప్రశ్నలు అడుగుతారనే అంశంపై యూ–ట్యూబ్ ద్వారా నేర్చుకున్నాను. అడ్వాన్స్ టాపిక్స్‌పై దృష్టి పెట్టాను. రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.

– వి.విశ్వనాథ ఆచారి, అనంతపురం

డిప్లొమాతో ఉద్యోగావకాశాలు పుష్కలం



డిప్లొమా పూర్తి చేసిన వారికి అద్భుతమైన అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అర్హులైన, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ఉన్నారు. కళాశాలలో అధునాతన సదుపాయాలు ఉన్నాయి. ప్రతి విద్యార్థికీ ఉద్యోగం వచ్చేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

– డాక్టర్ సి.జయచంద్రారెడ్డి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, అనంతపురం

అంధవిశ్వాసాలపై చైతన్య బావుటా



వేషభాలెరిగి కాషాయ వస్త్రముల్
కట్టగానె ముక్తి కలుగబోదు
తలలు బోడులైన తలపులు బోడులా
విశ్వదాభిరామ ! వినుర వేమ !

నేడు యోగి వేమన జయంతి

.. అంటూ ఆటవెలదినే తూటాలుగా మార్చి సనాతన ధర్మమంటూ మత మౌఢ్యాన్ని ప్రచారం చేసే వారిపై విరుచుకుపడిన మహాకవి ఆయన. మూఢనమ్మకాలపై చైతన్య బావుటా ఎగరేసిన అభ్యుదయ ప్రజాకవి వేమన పద్యం తెలియని తెలుగు వారు ఉండబోరన్నది లోకోక్తి. 1652–1780 మధ్య కాలంలో జీవించిన వేమన కవిగానే కాకుండా సంస్కరణాభిలాషిగా, కులాలను నిరసించిన మానవతామూర్తిగా, పరభాషా ఆధిపత్యాన్ని ప్రశ్నించిన చిరస్మరణీయుడిగా తెలుగువారి గుండెల్లో నిలిచిపోయారు. ఆదివారం వేమన జయంతి.

అనంతపురం కల్చరల్:

వేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలి



వేమన సాహిత్యానికి విస్తృత ప్రచారం చేయడానికి అనేక ఏళ్లగా ప్రయత్నిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో వేమన జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ ప్రభుత్వం కూడా అధికారికంగా ప్రకటించాలని కోరుతున్నాం. గత మూడేళ్లలో 300కు పైగా పాఠశాలల్లో చిన్నారులకు పద్యపఠన పోటీలు, వ్యాసరచనలు నిర్వహించి ప్రోత్సహిస్తూ వస్తున్నాం. చిన్నారుల్లో వేమన సాహిత్య పఠనం మరింత పెద్ద ఎత్తున సాగాలి.

– డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, వేమన ఫౌండేషన్ కార్యదర్శి

బీరువాల వర్కర్ హత్య

- భార్య, ప్రియుడిపై తల్లి ఫిర్యాదు



మృతుడు అల్లా బకాష్

హిందూపురం అర్బన్: పట్టణంలో బీరువాల వర్కర్ దారుణహత్యకు గురయ్యాడు. భార్య, ఆమె ప్రియుడు కలిసి హత్య చేసినట్లు హతుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. రహమత్‌పురంలో నివాసముండే అల్లాబకాష్(33) బీరువాల వర్కర్‌గా పనిచేస్తూ తల్లి, భార్య, ఇద్దరు కుమారులను పోషించుకుంటున్నాడు. ఈయన భార్య తబసుమ్‌కు అదే ప్రాంతానికి చెందిన నదీం అనే వ్యక్తితో పరిచయం ఉంది. ఆ పరిచయం కాస్తా వారిద్దరి మధ్య సాన్నిహిత్యానికి దారితీసింది. ఈ క్రమంలో వీరికి అడ్డుగా ఉన్నాడని అల్లాబకాష్‌ను అడ్డు తొలగించాలనుకున్నారు. శనివారం ఉదయం అల్లాబకాష్ విగతజీవిగా గదిలో పడి ఉన్నాడు. ఏమైందని అల్లాబకాష్ తల్లి అడిగితే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు తబసుమ్ సమాధానమిచ్చింది. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానితురాలు కింద భార్యను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయగా.. తానే చున్నీతో గొంతు బిగించి చంపినట్లు అంగీకరించింది. అయితే భార్య తబసుమ్ ఆమె ప్రియుడు నదీం సహకారంతోనే హత్య చేసిందని అల్లాబకాష్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అబ్దుల్ కరీం తెలిపారు.

నాడు అర్హులు.. నేడు అనర్హులట!

- పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులపై కూటమి సర్కారు నిర్దయ
- ప్రిలిమ్స్‌లోనూ అర్హత సాధించిన అభ్యర్థులు
- కోర్టు కేసు, ఎన్నికలతో అప్పట్లో ఆగిన దేహదారుఢ్య పరీక్షలు
- రెండునెలల క్రితం వాటి ప్రకటన జారీ
- ఇప్పుడు వయసు మీరిందంటూ పలువురిని అనుమతించని అధికారులు
- ఇదేం న్యాయమంటూ అభ్యర్థుల గగ్గోలు



దేహదారుఢ్య పరీక్షల్లో పాల్గొన్న కానిస్టేబుల్ అభ్యర్థులు

ఇదీ వయసు నిబంధన..	
జనరల్, ఓబీసీ అభ్యర్థులకు :	18 నుంచి 27 ఏళ్లు
ఎస్సీ, ఎస్టీ కేటగిరీ వారికి :	18 నుంచి 32 ఏళ్లు

అనంతపురం : పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్దయతో వ్యవహరిస్తోంది. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన పలువురిని దేహదారుఢ్య పరీక్షలకు అనుమతించకుండా తీరని అన్యాయం చేస్తోంది. రెండేళ్ల క్రితం ఇచ్చిన నోటిఫికేషన్ నాటికి వారు వయసు రీత్యా అర్హులే. కానీ.. కోర్టు కేసు, ఎన్నికల కారణంగా గతంలో దేహదారుఢ్య పరీక్షలు ఆగిపోయాయి. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే ఈవెంట్స్ పెట్టి, నియామకాలు చేపట్టకుండా ఐదు నెలలపాటు కాలయాపన చేసింది. ఇప్పుడు వయసు మీరిపోయిందంటూ అనేకమందిని ఇళ్లకు పంపేస్తోంది. వారు అర్హులైనప్పటికీ, వారి తప్పేమీ లేకపోయినప్పటికీ నిర్దయగా తిరస్కరిస్తోంది. దీంతో అభ్యర్థులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇదేమిటని సెలక్షన్ అధికారులను అడిగితే.. తామేమీ చేయలేమని, ఏదైనా ఉంటే రిక్రూట్‌మెంట్ బోర్డుకు విన్నవించుకోవాలని సూచిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 411 ఎస్‌ఐ, 6,100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎస్‌ఐ పోస్టులకు ప్రిలిమ్స్, దేహదారుఢ్య పరీక్షలు పూర్తయ్యాయి. కానిస్టేబుల్ పోస్టులకు 2023 జనవరి 22న ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించారు. తమ సర్వీసును సైతం పరిగణనలోకి తీసుకోవాలని హోంగార్డులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈవెంట్స్ (దేహదారుఢ్య పరీక్షలు)కు బ్రేక్ పడింది. అనంతరం సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదునెలల పాటు ఈ పోస్టుల భర్తీని పట్టించుకోలేదు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులంతా మళ్లీ ఆన్‌లైన్‌లో ఈవెంట్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని రెండు నెలల క్రితం ప్రకటించింది. అప్పట్నుంచి కష్టపడి దేహదారుఢ్య పరీక్షలకు సిద్ధమైన పలువురు అభ్యర్థులను వయసు మీరిందంటూ అనుమతించకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇలా ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే వంద మందికి పైగా అన్యాయానికి గురయ్యారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఇదెక్కడి న్యాయం?



దేహదారుఢ్య పరీక్షలు జనవరి 17న నిర్వహిస్తున్నట్లు హాల్‌టికెట్ ఇచ్చారు. అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియానికి వెళ్లాక.. 'మీకు వయసు అయిపోయింది. అర్హతలేద'ని చెప్పారు. నోటిఫికేషన్ జారీ సమయానికి వయసును పరిగణనలోకి తీసుకోవాలి గానీ అందుకు విరుద్ధంగా తీసుకుంటున్నారు. ఈ పరీక్షలకు నెలన్నర నుంచి సిద్ధమయ్యాను. తీరా ఇప్పుడు అర్హత లేదనడంతో కానిస్టేబుల్ కల చెదిరిపోతోంది.

– ఎస్. చంద్రశేఖర్, కానిస్టేబుల్ అభ్యర్థి, అనంతపురం

'లెక్క' లేని వారిపై 'లుక్కు'

- ఉమ్మడి జిల్లాలో ఏ రికార్డుల్లో లేని వారి సంఖ్య 3.50 లక్షలు
- ఆధార్ కార్డుల్లేని చిన్నారులు 1.20 లక్షలున్నట్లు వెల్లడి
- ఈ నెలాఖరులోగా వారి ఆధారాలు సేకరించి నమోదుకు కసరత్తు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: 40 లక్షలకు పైగా జనాభా కలిగిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎలాంటి రికార్డుల్లో లేని వారి సంఖ్య మూడున్నర లక్షలు ఉన్నట్టు వెల్లడైంది. రెవెన్యూ, మున్సిపాలిటీ, పంచాయతీరాజ్, డిస్కమ్స్, రవాణా తదితర అన్ని శాఖల వివరాల్లో వీరి వివరాలు లేకపోవడం విస్మయ పరుస్తోంది. అసలు ఇంతమంది ఎలాంటి రికార్డుల్లో నమోదు కాకుండా ఉండటం ఆశ్చర్యంగా ఉందని అధికారులే చెబుతున్నారు. ఈ క్రమంలో వారి ఫోన్ నంబర్లు, ఇళ్ల తదితర వివరాలను సేకరించి గ్రామ వార్డు సచివాలయాల పరిధిలోకి తీసుకురావాలనే లక్ష్యంగా అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా సంచార జాతుల ప్రజలు ఉన్నాయి. వీరు జిల్లాలో ఇళ్లు కట్టుకున్నా బతుకుదెరువు కోసం నెలల తరబడి ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. ఈ క్రమంలో వీరిపై దృష్టి సారించి రేషన్, పెన్షన్ తదితర పథకాలు అందుతున్నాయా లేదా పరిశీలించాలని వార్డు, గ్రామ సచివాలయ సిబ్బందిని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఆధార్ కార్డులపై అవగాహన లేదు

ఉమ్మడి జిల్లాలో 1.20 లక్షల మంది ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డులు లేవని కూడా వెల్లడైంది. స్త్రీ శిశు సంక్షేమశాఖ లెక్కల ప్రకారం ఈ లెక్క తేలింది. ఈ క్రమంలో గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఆధార్ నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి 15 రోజులకోరి కలెక్టర్లు దీనిపై సమీక్ష చేయాలని ఆదేశాలు వచ్చాయి. గతంలో ఆధార్ నమోదు కేంద్రాల్లో మాత్రమే ఆధార్ నమోదుకు అవకాశం ఉండేది. కానీ గత ఐదేళ్ల కాలంలో ఆస్పత్రుల్లోనే ఆధార్ నమోదుకు అవకాశం ఇచ్చారు. కానీ ఇప్పటికీ చాలా మంది తల్లిదండ్రుల్లో బిడ్డలకు ఆధార్ కార్డులు తీసుకోవాలనే దానిపై అవగాహన లేకపోవడం గమనార్హం. ఆధార్ కార్డు లేనిదే ఇప్పుడు ఎలాంటి పథకాలూ అందుకునేందుకూ అవకాశం లేని పరిస్థితి.

అనంతపురం జిల్లాలో	
ఏ రికార్డుల్లో లేని వారు	2,09,192
ఇప్పటివరకు గుర్తించింది	8,129
ఇంకా గుర్తించాల్సింది	2,01,063
ఆధార్ కార్డు లేని చిన్నారులు	7,5287
ఇప్పటివరకూ ఎన్‌రోల్ చేసింది	2,539
ఇంకా ఎన్‌రోల్ చేయాల్సింది	72,748

శ్రీ సత్యసాయి జిల్లాలో	
ఏ రికార్డుల్లో లేని వారు	1,43,543
ఇప్పటివరకు గుర్తించింది	8,744
ఇంకా గుర్తించాల్సింది	1,34,799
ఆధార్ కార్డు లేని చిన్నారులు	43,355
ఇప్పటివరకూ ఎన్‌రోల్ చేసింది	1,784
ఇంకా ఎన్‌రోల్ చేయాల్సింది	41,571

త్వరలో అందరికీ ఆధార్ కార్డులు

కొంతమంది తల్లిదండ్రులకు తమ పిల్లలకు ఆధార్ కార్డు ఇప్పించాలనే అవగాహన లేదు. దీనివల్లే చాలామందికి కార్డులు లేవు. దీనికోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఆధార్ నమోదు కేంద్రాలు పెంచుతున్నాం. ప్రతి ఆస్పత్రిలో పుట్టిన వెంటనే బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాలి. ఆ సర్టిఫికెట్‌తో ఆధార్ నమోదుకు వెళితే వెంటనే నమోదు కావాలి. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తిచేస్తాం.

–డా.వినోద్‌కుమార్, కలెక్టర్, అనంతపురం

సైబర్ నేరగాడు అరెస్ట్



అరెస్ట్ అయిన నిందితుడు

అనంతపురం: ఆరోగ్యశ్రీ విభాగం పేరుతో రోగుల బంధువులకు ఫోన్ చేసి తన ఖాతాకు యూపీఐ పేమెంట్స్ ద్వారా నగదు వేయించుకుంటున్న సైబర్ నేరగాడిని అనంతపురం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం దుబ్బార్లపల్లికి చెందిన సాకే ఓబులేసు కుమారుడు సాకే శివయ్య బీఈడీ వరకు చదివి బెట్టింగ్, జల్సాలకు అలవాటు పడ్డాడు. సులువుగా డబ్బు సంపాదించడం కోసం రక్తబంధం గ్రూపు ఆర్గనైజేషన్ ట్రస్టు అనే వాట్సాప్ గ్రూపులో జాయిన్ అయి, ఆ గ్రూపులో రక్తం ఎవరికి అవసరం అవుతుందో ఆ సెల్ నంబర్‌కు ఫోన్ చేసి 'నేను ఆరోగ్యశ్రీ విభాగం నుంచి అని పరిచయం చేసుకుని మీకు ఉచితంగా ట్రీట్‌మెంట్ కావాలంటే కొంత డబ్బు చెల్లించాలని ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా డబ్బులు వేయించుకుని, తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేస్తుండేవాడు. ఈ నెల 13న సర్వజనాస్పత్రి ఆర్థో వార్డు, గైనిక్ వార్డులో ఉన్న ఐదుగురు పేషెంట్లకు ఫోన్ చేసి వారి నుంచి రూ.12 వేలు డిపాజిట్ చేయించుకుని మోసం చేశాడు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు సైబర్ నేరం కింద కేసు నమోదు చేశారు. నిందితుడు సాకే శివయ్యను శనివారం అరెస్ట్ చేశారు. డిసెంబర్ నుంచి ఇప్పటి దాకా మొత్తం 12 మంది అమాయకుల నుంచి రూ.30 వేలు అక్రమంగా డబ్బు వేయించుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజల ఆరోగ్యం కోసమే 'స్వచ్ఛాంధ్ర'



మానవహారంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజ్‌బేగం

పుట్టపర్తి అర్బన్: ప్రజల ఆరోగ్యం మెరుగుపరచడానికే స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ ఫైరోజ్ బేగం అన్నారు. శనివారం వైద్యాధికారులతో కలిసి ప్రశాంతి గ్రామంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆస్పత్రుల వద్ద చెత్తా చెదారం, కలుపు మొక్కలు తొలగించి పచ్చదనం పెంపొందించాలన్నారు. ప్రతి నెలా మూడో శనివారం అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, సెకండరీ హెల్త్ ఫెసిలిటీస్, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో 'స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్' నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, డీఎల్‌ఏటీఓ డాక్టర్ తిప్పయ్య, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ నివేదిత, డీపీహెచ్‌ఎన్‌ఓ వీరమ్మ, డిప్యూటీ డెమో బాబా ఫక్రుద్దీన్, సూపరింటెండెంట్లు ఉదయ్, నాగభూషణ, స్టాటిస్టికల్ ఆఫీసర్ కళాధర్, డాక్టర్ గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.